సెక్రటరీ అవతల సిమెంటు మీద

పరీక్ష రాశాను. తరువాత.

ఇంటర్వ్యూ అయిపోయింది. ఫలితాలు తెలిశాయి. ఉద్యోగం వచ్చింది. ఆనందంతో ఎగిరి గంతులు వేయాలనిపించింది. రోడ్ల వెంట పరుగెత్తుదామనిపించింది. పరుగెడితే పిచ్చివాడు అని అనుకుంటారు. ఈ మహానగరంలో కార్లు బాణంలా దూసుకుపోతుంటాయి. ఏ కారుకిందన్నా పడితే ప్రమాదం, ప్రాణం పోకపోయినా ఏ కాలో చెయ్యో విరిగినా ఆ వచ్చిన కాస్త ఉద్యోగం ఊడ్చిపెట్టుకు పోతుంది. ఎవరితో నన్నా చెప్పి ఈ సంతోషాన్ని పంచుకుందామంటే ఎరిగి ఉన్న వాళ్ళు ఒక్కరూ కన్పించడంలేదు. ఏం చేయను? ఆ కొత్తచోట ఖరీదైన హోటలుకెళ్ళి తనివిదీరా తిందామనుకున్నాను బోలెడు ఖర్చవుతుంది. మనస్కరించలేదు. పోనీ మంచి ఇంగ్లీషు సినిమాకుపోతే...పోస్టర్లలో అర్ధనగ్నంగా ఉన్న బొమ్మలు చాలా కన్పించాయి-వళ్ళు పులకరించినట్లయింది. మా ఊళ్ళో అయితే రూపాయి పావలా పెడ్తే హాయిగా సినిమా చూడచ్చు, మరి ఇక్కడో కనీసం దానికి రెట్టింపయినా అవుతుంది.

ఈ సినిమా చూడకపోతే ఏం మునిగింది? అనుకున్నాను. నగరంలో రోడ్లూ, వచ్చేపోయే కార్లూ, స్కూటర్

లలో వెళ్ళే ఇంటల్నీ, షాపుల్లో అందంగా అమర్చిన బొమ్మల్నీ చూసుకుంటూ కనీసం రెండుమైళ్ళైనా నడచి వుంటాను. నడుస్తూనే ఉన్నాను. కాళ్ళు పీకుతున్నై, దోవలో నాలాంటి వాళ్ళు అక్కడక్కడ కన్పిస్తున్నారు ఎవరినన్నా ఆపి పలకరించి నెమ్మదిగా స్నేహం చేసుకుని ఈ వార్త చెప్తే-కొంత బరువు తగ్గుతుంది మనసు తేలిగ్గా హాయిగా వుంటుంది. ఎరగని వాళ్ళను పలకరిస్తే అది నాగరికత అనిపించుకోదు. అయినా ఈ మహాపట్టణంలో ఒకరి సంగతి ఒకరికి అక్కర్లేదు. ఎందుకో ఈ సంతోషాన్ని నాలో ఇముడ్చుకోలేక పోతున్నాను సీతకు ఈ వార్త ఎంత త్వరగా తెలియచేస్తే అంతమంచిది. నా కన్నా ఎక్కువగా సంతోషిస్తుంది. ఇల్లంతా ఎగిరి ఎగిరి అలసిపోయి రొప్పుతుంటే అది నాకు ఇక్కడకు వినిపిస్తుంది. వెళ్ళిరండి, మీకు తప్పకుండా ఉద్యోగం వస్తుంది. అని ఎంతో ధైర్యంగా చెప్పింది. అలాగే సీత కోరిక నెరవేరింది. సీతకి టెలిగ్రాం ఇస్తే ఉద్యోగం వచ్చినట్టు. అదో పల్లెటూరు, రైల్వే స్టేషనులేదు. తపాల సౌకర్యాలు అంతగాలేవు. రోడ్డుసరిగా ఉండదు. ఒక బస్సు ముక్కుతూ ముసుగుతూ వస్తుంది రోజుకొకసారి సీతకు నేనిచ్చిన టెలిగ్రాం వెంటనే తీసుకుని వెళ్ళి ఇవ్వాలని ఆ పోస్టు బంట్రోతుకు బుద్ధి పుట్టాలి. సైకిల్ మీద ఆ పల్లెటూరు వెళ్ళాలి అతను దోవలో అనేకచోట్ల బద్ధకించి ఆగచ్చు తాపీగా వెళ్ళచ్చు. బీడీకాల్చుకుంటూ ఏ చెట్టుకిందో చల్లగాలికి కూచుని కదిలే ఆకుల్ని చూస్తూ పోతున్న మేఘాలను

చూస్తూ ఆలస్యం చేసినా అతన్ని అడిగే వాళ్లుండరు. అయినా టెలిగ్రాములో చాలా విషయాలు వ్రాయాలి నేను. వీళ్లు మాట మాటకూ ఖరీదు కడ్తారు. బోలెడు ఖర్చు. మా అమ్మకు టెలిగ్రామ్ అంటే విపరీతమైన భయం. ఆమెకు ఏమైనా అయిపోవచ్చు కవరుకొని పెద్ద ఉత్తరం వ్రాస్తూ అన్ని సమస్యలూ తీరిపోతాయి. ఒక టేవిటి రెండు ఒకే కవర్లో రెండు. ఒకటి అమ్మకు రెండోది సీతకు అమ్మకు రాసిన విషయాలు సీతకు మళ్ళీ రాయక్కర్లేదు. అమ్మ ఎలాగూ ఆ వుత్తరం సీతకు చూపిస్తుంది. ఆ విషయాలు మినహాయించి సీతకు తనివీదీరా ఎన్నో సంగతులు, బయటకు ధారాళంగా చెప్పకూడనివి పైకి మాట్లాడుకోడానికి వీలు లేని విషయాలెన్నో వ్రాయచ్చు అవన్నీ కవర్లో ఒరిగి పడి ఉంటాయి. ఎవరి కంటా కనపడకుండా. పోస్టాఫీసుకు వెళ్ళాను చాలా పెద్ద భవనం, అన్నీ పెద్ద పెద్ద భవనాలే ఇక్కడ రాసు కోవడానికి అనువుగా బెంచీలు వేశారు చాలా ఉన్నాయి. ఓ మూల బెంచీలో కూర్చుని ఉత్తరం వ్రాశాను. వ్రాస్తు న్నంత సేపు భయంగానే ఉంది నా ఉత్తరంలోకి ఎవరైనా తొంగిచూస్తున్నారేమోనని గబ గబ కొన్ని ముద్దులతో ఉత్తరం ముగించి కవరు గట్టిగా అతికించి పోస్టులో వేశాను.

* * *

చేరవలసిన రోజునకు ఉద్యోగంలో చేరాను. కొత్త పెళ్ళికూతురులా ముసి ముసి నవ్వులతో అందరినీ చూసి

చూడనట్లు చూస్తూ తల వంచకుండా నడుస్తూ...ఆఫీసు సైన్యంలో ఒకణ్నైనాను. సీత దగ్గరనుండి ఎన్నాళ్లకు వుత్తరం రాదు. ఎదురుచూసి కళ్లు కాయలు కాస్తున్నాయి. కొంపతీసి అసభ్యకరంగా వ్రాశానని కోపం వచ్చిందేమో మొగుడు పెళ్ళాం మధ్య అసభ్యత ఏముంది? నా భయం కాని? అయినా ఆఖరు మూడు వాక్యాలేగా కొంచెం గమ్మత్తుగా వ్రాసింది. మా అమ్మకు సుస్తీగా వుందేమో...నాకు మనసు పరి పరి విధాల పోతున్నది. చెప్పడదామంటే చాలా దూరంలో వుంది. ఉత్తరంలో చెప్పడితే బావుండదు. బాధ పడ్తుంది. ఈ అక్షరాలు అసలే వంకరగా వుంటాయి. కోపంగా రాస్తే ముళ్ళ ముళ్ళగా వుంటయి ఈ ఆడవాళ్ళకు బుద్ధిలేదు. కొంచెం దూరమైతే నిర్లక్ష్యం చేస్తారు. ఈ అవమానం భరించలేను...దుఃఖం పొర్లుకొస్తూంది ... పదిహేనురోజు లయింది.

హైదరాబాద్‌లో మా దూరపు బంధువు ఒక ముసలాయన ఇంట్లో వున్నాం. నన్ను ఆప్యాయంగా చూస్తున్నాడు ఒకరోజు...ఎక్కడన్నా ఇల్లు చూస్తున్నావా అబ్బాయ్... అని అడిగాడు.

ఒకరోజు ఆఫీసు నుండి రాగానే నీకేదో ఉత్తరం వచ్చిందోయ్ అన్నాడు ఆయన చేతిలోంచి ఉత్తరం తీసుకున్నాను. గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకొని హాయిగా పడుకుని- నెమ్మదిగా కవరు విప్పి, చీకె మడతల్లా వున్న

కాగితాలు తీసి... చిన్నవిగా గుండ్రంగా వున్న అక్షరాలు మీదిమీదికి వస్తుంటే కన్నార్పకుండా చూస్తూ రెండు చేతుల్లోకి తీసుకున్నాను.

"ప్రియమైన మీకు"

మీరు వ్రాసిన ఉత్తరం చాలా ఆలస్యంగా చేరింది. హైదరాబాదులాంటి మహానగరంలో మీకు ఉద్యోగం దొరకటం చాలా అదృష్టం నా నోము ఫలించింది. అమ్మ వారి కృప అంతా కలిసి రెండువందల పది వస్తుందన్నారు. మన కంతకన్నా ఎక్కువక్కర్లేదు. మనపెళ్ళి అయిన కొద్ది రోజుల్లోనే ఉద్యోగం రావటం... నాకు చాలా ఆనందంగా వుంది. మీరు నా మెళ్ళో మంగళసూత్రం కట్టేప్పుడు నాకు చక్కలిగింతై ఏవిటోగా వుంది. మీ ముక్కులోంచి వచ్చే గాలి వేడిగా నన్ను పులుముకున్నది. మీ ఉత్తరం చూడ గానే నాకివన్నీ జ్ఞాపకం వచ్చినయి సిగ్గుపడ్డాను. ఇక్కడ విపరీతంగా వానలు మన కిటికీలోంచి వాన తుంపరలు పడు తుంటే ఏవిటో పన్నీరు జల్లినట్టుగా వుంది అత్తయ్య వంట్లో కులాసాగానే వుంది. ఆ పట్నవాసంలో నేనుండలేను బాబూ అంటున్నారు. త్వరగా మంచి ఇల్లు తీసుకోండి నేను ఆషాడం వెళ్ళగానే వస్తాను మరో ఇరవై రోజులు. దర్జాగా యాభై రూపాయలైనా సరిపెట్టి బాగా గాలివచ్చే ఇల్లు తీసుకోండి అద్దెపోను మిగతా డబ్బుతో హాయిగా వుండవచ్చును. అత్తయ్య దగ్గర వంటలు పిండివంటలూ అన్నీ నేర్చుకున్నాను మీరు మరీ కొంటెవారై పోతున్నారు. అత్తయ్య మీరు

వ్రాసిన ఉత్తరం చూస్తే ఇంకేమన్నా వుందా...ఈ ఉత్తరం చేరిన వెంటనే ఇంటికోసం గట్టి ప్రయత్నం చెయ్యండి... వాన వల్ల మన ఊరు దగ్గర ఉన్న కాలవ పొంగింది. బస్సులు సరిగా రావడంలేదు అందుకే మీ ఉత్తరం నిదానంగా చీమల్లే వచ్చింది. సినిమాలకి హోటళ్ళకు వెళ్ళి డబ్బు వృధా చేయకండి. మన దొడ్లో మల్లెపందిరి విపరీతంగా పూలు కాస్తున్నది. నాకింకా ఏం రాయాలో తెలియడం లేదు మీ ఉత్తరానికి ఎదురు చూస్తుంటాను.

మీ సీత

* * *

రోజులు గడుస్తున్నాయి. ఆఫీసులో పాతబడ్డాను. ఇటీవలే పెళ్ళి అయిందని తెలిసి కొంతమంది నా మీద గౌరవం చూపిస్తున్నారు. ఒకరిద్దరు సన్నిహితులైనారు. వాళ్ళతో రెండురోజులు ఇళ్ళకోసం తిరిగాను నా కనువైన ఇల్లు ఎక్కడా కన్పడలేదు. ఇల్లు నాకు వెంటనే దొరక్కపోయినా నాకు చాలా సంతోషంగా వుంది. బోలెడన్ని రంగురంగుల పెద్ద మేడలు చూశాను. ప్రతి మేడ ముందు బోలెడంత ఖాళీ స్థలం. రకరకాల పూలమొక్కలు. ఆకుపచ్చటి చేలు. ఆ పూల మొక్కలను కావలించుకుని ఆ గడ్డిలో పొర్లితే బావుండుననిపించింది. చూడటానికి కనుల పండువుగా వుంది. మేడల్లో వుంటున్న మనుష్యులు సాధారణంగా కన్పించరు. ఎటు చూసినా చిత్ర విచిత్రమైన కర్టెన్లు. కొన్ని మేడల్లో సింహంలాంటి జాతికుక్కలు- నాలుకలు బయటపెట్టి అటూ

ఇటూ తిరుగుతున్నాయి. మీరనుకున్న అద్దెలో ఇల్లు దొరకడం కష్టం గురూ ... అన్నాడు సన్నిహితులలో ఒకడు.

"నీకో ఉపాయం చెప్తాను" అన్నాడు మరోతను.

రాంకోటలో యాదయ్య అనే ఒకతను వున్నాడట అతను చాలామందికి ఇళ్ళు కుదిర్చి పెట్టి సహాయం చేస్తుంటాట్ట...అతన్ని కలుసుకోమని సలహా.

అతనిల్లెక్కడో తెలియదన్నాను అతనికి ఇల్లు లేదన్నారు. ఇల్లు లేనివాడు వాకిలెట్లా చూపిస్తాడనుకున్నాను కాదు కాదు అతనికదే వృత్తి. అతను ఎక్కడ వుంటున్నదీ చెప్పారు.

సెమిటరీ దగ్గర అన్నారు.

అదేవిటి? అన్నాను.

అదో రకమైన స్మశానం అన్నారు. నేను గతుక్కుమన్నాను. స్మశానం అంటే నాకసలే భయం. మా నాయనమ్మ పోయినపుడు ఆ ప్రదేశం ఆ వాతావరణం చూశాను. తరువాత పదిరోజులు నిద్ర పట్టలేదు. ఏవో కలలు, భయం వణుకు. కొన్నాళ్ళకు మరచిపోయినాను.

ఊరి మధ్యలో సెమిటరీ ఏమిటి? అన్నాను. ఒకటి కాదు. బోలెడున్నాయి, మేడలూ, ఇవి ఒకరినొకరు తొంగి చూస్తూ చాలాచోట్ల ఉన్నాయి అన్నారు.

పొద్దునపూట వెళ్తేనే అతను దొరుకుతాడన్నారు. ఒకరోజు గుర్తులు తెలుసుకుని బయలుదేరాను వెతు

కుంటూ నెమ్మదిగా ఆ ప్రాంతాలకు వెళ్ళాను నాకో అందమైన మసీదు కన్పించింది. ప్రార్థనా మందిరం, శుభ్రంగా అందంగా వుంది. దానిముందు ఓ పెద్దచెట్టు, చెట్టుకింద నీడ, అక్కడ కొంచెంసేపు నిల్చున్నాను. మసీదు అందాన్ని చూస్తూ...తరువాత ఎడంవైపుగా రెండడుగులు వేశాను. స్నేహితులు చెప్పిన సెమిటరీ కన్పించింది. విశాలమైన ఆవరణ, చుట్టూ కాంపౌండు వాలు, లోపల అక్కడక్కడా చెట్లూ, చిన్న చిన్న మేడల్లాంటి అందమైన సమాధులు, నే నూహించుకున్నంత భయంకరంగా లేదు. నీడనిచ్చే ఒక వేపచెట్టుకింద అరుగు వున్నది. దానికి దగ్గరే ఓ ముసలివ్యక్తి ముహం కడుక్కుంటున్నాడు. నేను సెమిటరీకి కొంచెం దూరంలో నిల్చుని అతనివైపే చూస్తున్నాను. మధ్య మధ్యలో సూర్యుడి వైపు చూస్తున్నాడు. నీరెండ నా కెందుకో సెమిటరీ లోపలకు వెళ్ళడానికి మనస్కరించ లేదు. మా నాయనమ్మ జ్ఞాపకం వచ్చింది. ఇంతత్వరగా లోపలకు వెళ్ళడమెందుకులే అనుకున్నాను దేనికోసమో వెదుకుతున్నట్టుగా అక్కడే తారట్లాడుతున్నాను అతనిదృష్టిని ఆకర్షించాలని.

చివరకు నన్ను అతను చూశాడు. నేను సెమిటరీలోపలకు వెళ్ళడానికి మనస్కరించలేదు. మా నాయనమ్మ. జ్ఞాపకం వచ్చింది. ఇంతత్వరగా లోపలకు వెళ్ళడమెందుకులే

అనుకున్నాను. దేనికోసమో వెదుకుతున్నట్టుగా అక్కడే తారట్లాడుతున్నాను అతనిదృష్టిని ఆకర్షించాలని.

చివరకు నన్ను అతను చూశాడు. నేను సెమిటరీకి సమీపంలో చుట్టూ ఉన్న పెద్ద పెద్ద మేడల్ని చూస్తున్నాను. నెమ్మదిగా నడుస్తూ వచ్చాడు. అతన్ని చూస్తుంటే ఎన్నాళ్ళకిందో చచ్చిపోయి సమాధిలోంచి లేవ లేక లేస్తూ వస్తున్నట్టుగా ఉంది.

నాకు దగ్గరగా వచ్చాడు. నేను రెండడుగులు వెనక్కి వేసాను. ఏం బాబూ ఇల్లు కావాలా? అన్నాడు. నేను అవునన్నట్లు తల ఊపాను.

"ఎంతలో కావాలి? పెళ్ళయిందా?" అన్నాడు చెప్పాను.

అబ్బో అంత అద్దెలో యాడదొరుకుద్ది అన్నాడు. నేనంతకన్నా ఇచ్చుకోలేనన్నాను నాకు సెమిటరీని చూస్తే భయం తగ్గింది. కాని నాకేదో ఇల్లు చూపించి నా దగ్గర ఎంతడబ్బు గుంజుతాడేమోనని భయంవేసింది.

నా ఉద్యోగ వివరాలు జీతం-జీవితం చెప్పాను. అతను నన్ను అర్థం చేసుకున్నట్టే కన్పించాడు. "ఓరూపాయ్‌పడేయ్ కూడదూ! అలా తిరిగొస్తాను" చాలా తేలిగ్గా అన్నాడు ఇచ్చాను.

చాయ్ తాగి బయల్దేరుతాను అన్నాడు, ఇచ్చాను. మర్నాడు అదే వేళకు కలుసుకోమన్నాడు.

ఆ రోజు రాత్రంతా యాదయ్య గురించే ఆలోచిస్తు

న్నాడు యాదయ్య మంచివాడు గానే కనిపించాడు. తప్పక నాకు సహాయం చెయ్యగలడనే నమ్మకం వుంది. నిద్ర పట్ట లేదు. ఏవో ఆలోచనలు ఇల్లు దొరుకుతుంది. సీతకు ఉత్తరం రాసాను, ఆమె బయలుదేరి వస్తుంది. రిసీవ్ చేసుకోడానికి స్టేషన్‌కు వెళ్ళతాను. నన్ను చూసి సీత సన్నగా నవ్వుతుంది ఇద్దరం కలసి ఆటోరిక్షాలో దగ్గర దగ్గరగా కూర్చుని ఇంటికి వస్తాం. మళ్ళీ కల నాయనమ్మ. నిన్న చూసిన సెమిటరీ సమాధుల్లో సావకాశంగా నిద్రపోతున్న అభాగ్యులు. అక్కడ దెయ్యంలా కనిపిస్తున్న యాదయ్య మా నాయనమ్మ ఎక్కడో పోయింది ఈ సెమిటరీలో నా కెందుకు కన్పిస్తుంది అనుకున్నాను.

కొంచెంసేపు కళ్ళు మూస్తూ కొంచెంసేపు తెరుస్తూ ఆ రాత్రి గడచింది. తెల్లవారదు తప్పదు గనుక తెల్లవారింది.

యాదయ్యను వెతుక్కుంటూ అనుకున్న టైముకు వెళ్ళాను.

యాదయ్య మసీదు దగ్గర కూర్చుని ఉన్నాడు. నన్ను చూడగానే లేచి నిల్చున్నాడు.

చాలా-చోట్ల తిరిగాను బాబూ అంత అద్దెలో నా కెక్కడా కన్పించలేదు.

ఆ చుట్టుప్రక్కల ప్రాంతాలలో ఒకటి రెండు మైళ్ళ వైశాల్యంలో ఎక్కడ ఇల్లు ఖాళీగా ఉన్న యాదయ

దృష్టిలో పడకుండా ఉండదన్నట్టుగా తెలిసింది. ఇల్లు
దొరక్కపోయినా అతనితో మాట్లాడుతూ అతన్ని గురించిన
వివరాలు చాలా తెలుసుకున్నాను, ఎంత ప్రశాంతజీవి అని
పించింది.

పొద్దునే ఒక బస్ సింగిల్‌చాతో ప్రారంభం అవు
తుంది అతని ఆఫీసుపని, పన్నెండు గంటలకు భోజనం చేస్తాడు
ఎక్కడ చేస్తాడో ఏం చేస్తాడో తెలియదు. పన్నెండు
మొదలు నాలుగింటి వరకూ సెమిటరీలో చెట్టునీడన అరుగు
మీద పడుకుంటాడు. బోలెడంత విశ్రాంతి. చిన్న ఇళ్ళ
దగ్గర నుండి పెద్ద ఇళ్ళు అంటే షుమారు నాలుగు వందల
అద్దెవరకూ అన్నివర్గాల వారికి ఇళ్లు చూపిస్తాడు. రోజుకో
రెండు రోజులకో ఒక కిరాకీ తప్పక తగుల్తుంది. ఇల్లు దొరికిం
తరువాత అయిదో పదో మనిషిని బట్టి బక్షీస్ తీసుకుంటాడు.
ప్రతిరోజు మసీదు శుభ్రం చేస్తాడు. మార్పుకోసం అక్కడ
అక్కడ కొంచెంసేపు కూర్చుంటాడు. ఆ ప్రాంతాలలో
నివసించే చాలామంది జీవితాలతో అతనికి పరిచయం ఉంది.

సెమిటరీలో ఏదన్నా ఉద్యోగమేమో అనుకున్నాను.
అదేమీకాదు, చాలా సంవత్సరాలనుంచి నా మకాం ఇక్కడే
నన్నెవరూ ఏమీ అనరు. నా కెవరూ లేరన్నాడు. ఒకప్పు
డున్నవాళ్ళు ఇప్పుడు సెమిటరీలో ఉన్నారేమో మరి అతని
గతం జ్ఞాపకం తెచ్చి అతన్ని బాధపెట్టదల్చుకోలేదు సెమిట
రీలో రాత్రిపూట భయం వేయదా అన్నాను "నా కేటి
భయం బాబూ...ఎప్పటికైనా ఇలాంటి చోటుకు చేరుకో

వల్సిందిగా. సెమిటరీ లోపల వున్న వాళ్ళు నన్ను ఎప్పటికప్పుడు ఆహ్వానిస్తూనే వుంటారు. మనం అనుకుంటే పోగలమా, బయటవాళ్ళు వాళ్ళంతట వాళ్ళు ఇక్కడకు రానే రారు" అన్నాడు. నాకేదో తత్వ బోధ చేస్తున్నట్టుగా ఉంది.

యాదయ్య నాకెందుకో ఆప్తుడైనట్లుగా అనిపించింది.

ఎంత చిన్న ఇల్లయినా సరే తప్పక నీవే చూసిపెట్టాలి. మా సీత తొందరపడ్తోంది...అన్నాను.

అలాగే బాబూ మరో రెండు రోజుల తర్వాత కన్పించండి. టీకాకు ఓ రూపాయ పడేయకూడదూ! అన్నాడు. ఎంత ఠీవిగా.

ఇల్లు దొరకాలేగాని రూపాయ ఏం భాగ్యం అనుకున్నాను.

• • •

ఈ రెండు రోజులూ ముళ్ళమీద ఉన్నట్టుగా వుంది. మళ్ళీ యాదయ్య దర్శనం.

నన్ను చూడగానే చిరునవ్వు పెద్ద చిరునవ్వు. ముడుతలు పడ్డ చర్మం ఆ నవ్వుకు సాగలేక సాగుతోంది.

ఆ వీధిలో మూల ఓ పావురాయి రంగు మేడ ఉంది చూశారూ! అన్నాడు.

"చూడకేం ఆ మేడముందుగా ఎన్నోసార్లు వెళ్ళాను" అన్నాను.

పోదాం రండి, చూపిస్తాను. అతని వెనకాలే నడుస్తున్నాను.

అది రెండస్తుల మేడ దూరం నుండి చూస్తే చుట్టూ గాజు కిటికీలు భయపడుతూ...నెమ్మదిగా లోపలకు వెళ్లాను. ఆవరణలో ఎన్నో రంగు రంగుల పూలమొక్కలు, గాజు కిటికీలకు రంగురంగుల కర్టెన్లు-మేడ చాలా ఎత్తు ప్రదేశంలో ఉంది ఆవరణలో పెద్ద లాన్...ఆకుపచ్చ తివాచి, కింది భాగమే చాలా ఎత్తులో ఉంది. షుమారు ముప్పై అడుగులు ఆ పూల మొక్కలు ఆకుపచ్చ తివాసీ చూసుకుంటూ మేడ వెనకవైపు వెళ్ళాను అతనితో.

అక్కడ కిందిభాగం అనుకున్న కిందిభాగం క్రింద మరో కొన్ని గదులున్నాయి. నా కాశ్చర్యం వేసింది. మేడముందు నుండి చూస్తే రెండస్తులే కన్పించినయి. వెనకవైపు మూడు అంతస్తులుగా ఉన్నాయి. పడకగది నౌకర్లుండానికి దాని పక్కనే బాత్‌రూమ్ అటువైపు రెండుగా పెద్ద పెద్ద గదులు తలుపులు పూర్తిగా వేసి ఉన్నాయి. ఇవి రెండూ కారు గరాజీలు బాబూ లోపల అంతా సిమెంటు చేసిందే. అయ్యగారికి రెండు కార్లుండేవి. ఒకటి వారి అబ్బాయిగారికి మరోటి అయ్యగారికి. అబ్బాయిగారు ఈ మధ్యనే ఇంగ్లండు వెళ్ళారు. అవసరంలేదని కారు అమ్మేశారు. గరాజి ఖాళీగానే ఉంది. చాలారోజులు ఎవ్వరికీ అద్దెకివ్వలేదు ఇచ్చే ఉద్దేశ్యంలేదు. నేను బ్రతిమాలుకుని మిమ్మల్ని గురించి చెప్పి, ఒప్పించాను అన్నాడు.

గరాజి తలుపులు తీసి చూపించాడు. లోపల పరి

శుభ్రంగా ఉంది లైటుగూడా ఉంది గోడకు ఒక పక్క రెండు మూడు గూళ్ళు ఉన్నాయి. అక్కడ కొంత సామాను పెట్టుకోవచ్చు గరాజి మధ్యలో కర్టెన్ కట్టుకుంటే ఒక పక్కగా వంటకు వీలుగావుంది.

దక్షిణావైపుగా తోటను తొంగి చూస్తూ చిన్న కిటికీ గూడా ఉంది. నా కంతకన్నా ఏం కావాలి ఆ తోటనూ, పూలనూ, చెట్లనూ చూస్తూ కూచోవచ్చు.

మరి మా అయ్యగారితో మాట్లాడఖర్లేదా? అన్నాను. అంతా నేను మాట్లాడేశాను మీకు నచ్చితే మంచి రోజు చూసుకుని చేరొచ్చు.

నాకెందుకో ఆ మేడంతా నాదేనేమో అనిపించింది. మేడపైన ఉన్నవారికీ నాకూ ఏ బేధం కన్పించలేదు. ఈ తోట ఈ పూలచెట్లు పూలు ఈ ఆకుపచ్చ తివాసి ఇవన్నీ నావే. సాయంత్రపూట వీటనన్నిటికి నీళ్లు నేనే పోస్తాను నా సరదా తీరుతుంది ఊరికే చేస్తానంటే యజమాని మాత్రం వద్దంటాడా! తోటపనికి సాయం సీతకూడా వస్తుంది. చూసే వాళ్ళకు నేను తోటమాలి పనిచేస్తుంటే బావుండదేమో చూసే వాళ్ళతో నాకు పనిలేదు. చేసేవాణ్ణి నేను నాకు వేరే ఉద్యోగం ఉంది ఖాళీ సమయంలో తోటచూసుకుంటాను. యజమాని ముట్టుకోవద్దని చెప్పుత్తాడేమో ఆ సింగినాథం ఆయనకు నేను నచ్చచెప్పగలను. యాదయ్యకు అయిదు రూపాయలిచ్చాను. యింట్లో చేరేరోజు కన్పించమన్నాడు.

సీతకు ఉత్తరం వ్రాశాను. పావురాయి రంగు మేడ, సెమిటరీ అవతల సిమెంటు మేడ, మేడలో తోట, పూలు, రకరకాల పూలు, మేడలో భాగం అద్దెకు దొరికింది. గాలీ వెలుతురూ బ్రహ్మాండం... వెంటనే రమ్మంటూ వ్రాశాను సీత ఎప్పుడో వచ్చి వాలుతుంది.

— ౦ —

జయశ్రీ